EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
22-01-2026
పేజీలు: 02







# భయపెడుతున్న షుగర్




భారత్ దేశం ఓ పెద్ద ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటోంది. అది డయాబెటిస్. తాజా అధ్యయనాల ప్రకారం దేశంలో 10 కోట్ల మందికి పైగా డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. మరో 13.6 కోట్ల మంది ప్రీ-డయాబెటిస్ దశలో ఉన్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీవనశైలి మార్పులు, పట్టణీకరణ, జన్యుపరమైన కారణాలు ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణాలుగా మారాయి. ICMR-INDIAB అధ్యయనం ప్రకారం.. దేశ జనాభాలో డయాబెటిస్ ప్రాబల్యం 11.4 శాతం ఉంది. పట్టణాల్లో ఇది 14.2 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 8.3 శాతంగా నమోదైంది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. డయాబెటిస్ ఉన్న వారిలో 60 శాతం మందికి తమకు వ్యాధి ఉందన్న విషయం కూడా తెలియదు. దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలైన తమిళనాడు, గోవా, పంజాబ్, మహారాష్ట్రల్లో డయాబెటిస్ కేసులు ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

వైద్యుల మాటల్లో.. డయాబెటిస్ ఒకే రకం వ్యాధి కాదు. ప్రధానంగా ఇది మూడు రకాలుగా ఉంటుంది. వాటిని సరిగ్గా గుర్తిస్తేనే సరైన చికిత్స సాధ్యం అవుతుంది.

టైప్—1 డయాబెటిస్ : సాధారణంగా పిల్లలు, యువతలో వస్తుంది. శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయదు. వీరికి జీవితాంతం ఇన్సులిన్ అవసరం. జన్యు పరంగా సక్రమించేది, ఫ్యామిలీ హిస్టరీ కారణాలు.

టైప్—2 డయాబెటిస్: భారత్‌లో అత్యధికంగా కనిపించే రకం. లైఫ్ స్టైల్, ఊబకాయం,స్ట్రెస్ వల్ల వచ్చేది. సరైన ఆహారం, వ్యాయామంతో దీన్ని నియంత్రించవచ్చు.

టైప్ -3 గెస్టేషనల్ డయాబెటిస్: గర్భధారణ సమయంలో మహిళల్లో వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే తల్లి, బిడ్డ ఇద్దరికీ ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



## రెండో స్థానానికి అర్జున్

నెదర్లాండ్స్‌లో జరుగుతున్న టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి మూడు రౌండ్ల తర్వాత అగ్రస్థానాన్ని కోల్పోయాడు. 13 రౌండ్లుగా సాగే ఈ టోర్నీలో మూడు రౌండ్ల దాకా సంయుక్తంగా తొలి స్థానంలో ఉన్న అతడు.. అనిష్ గిరి (నెదర్లాండ్స్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌నూ డ్రా చేసుకున్నాడు. కానీ నీమన్ (యూఎస్), నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్) తమ ప్రత్యర్థులను ఓడించడంతో ఆ ఇద్దరూ చెరో 3 పాయింట్లతో తొలి స్థానానికి దూసుకెళ్లారు. 2.5 పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు. గుకేశ్, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది.

## 'మొగుడు' అంటూ రాబోతున్న విశాల్


తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో "మొగుడు" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.

## మేడారంలో కుక్కకు ఎత్తు 'బంగారం'... క్షమాపణ చెప్పిన సినీ నటి



తెలంగాణ రాష్ట్రంలోని ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో యువ నటి టీనా శ్రావ్య తన పెంపుడు కుక్కకు బంగారంతో తులాభారం వేయడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబం సమేతంగా మేడారం వచ్చిన టీనా శ్రావ్య, తన పమేరియన్ జాతికి చెందిన కుక్కకు 'బంగారం' తులాభారం వేశారు. భక్తులు తమ మొక్కులు తీరిన సందర్భంగా సమ్మక్క, సారలమ్మలకు 'బంగారం' సమర్పించడం ఆనవాయతీ. ఇక్కడ 'బంగారం' అంటే బెల్లంను తూకం వేసి సమర్పించడం. సాధారణంగా భక్తులు అమ్మవార్లకు 'బంగారం' సమర్పిస్తుంటారు.

## రికార్డు స్థాయిలో రూపాయి పతనం



అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. నిన్న 90.97 వద్ద ముగిసిన రూపాయి, ఇవాళ ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIలు) దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



## జగన్ పాదయాత్రకు ముహూర్తం ఫిక్స్

ఏలూరులో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, ఏ వర్గానికీ మేలు చేయలేదని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, "జగన్ ఉంటే బాగుండేదని" ఇప్పుడు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి మిగిలింది ఇంకో మూడేళ్లేనని అన్నారు. ఇక తాను ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ స్పష్టం చేశారు. ఈ ఏడాదిన్నర పాటు పూర్తిగా ప్రజల్లోనే ఉంటానని, ప్రతి వారం ఒక నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ అవుతానని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు నియోజకవర్గంతో మొదలు పెడుతున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన మొత్తం అబద్ధాలు, మోసాలేనని ఆరోపించిన జగన్.. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎవరితోనైనా ఎలా కావాలంటే అలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీస్ వ్యవస్థను కూడా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా మారిందని జగన్ అన్నారు.

## 'విత్ లవ్' తెలుగు టీజర్ విడుదల




'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు అభిషన్ జీవింత్ ఇప్పుడు హీరోగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'విత్ లవ్'. ఈ సినిమాకు మదన్ దర్శకత్వం వహిస్తుండగా.. మలయాళీ బ్యూటీ అనస్వరా రాజన్ కథానాయికగా నటిస్తుంది. ప్రముఖ నటుడు రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ టీజర్ చూస్తుంటే లవ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది.



## సీక్రెట్ చెప్పిన జాన్వీ కపూర్

ప్రస్తుతం చాలామందిని వేధిస్తున్న సమస్య అధికబరువు. బరువు నియంత్రణ కోసం రకరకాల టిప్స్, డైట్స్ ఫాలో అవుతూ చాలా కష్టపడుతుంటారు. అయితే వెయిట్ లాస్ అంటే జిమ్‌లో చెమటోడ్చడం, డైట్ పేరుతో కడుపు మాడ్చుకోవడం అనేది అందరికీ తెలిసిందే. కానీ ఒక స్టార్ హీరోయిన్ మాత్రం ఒక సింపుల్ ఈటింగ్ హ్యాక్‌తో ఈ సమస్యకు సొల్యూషన్ ఇచ్చింది. కష్టపడి వర్కౌట్ చేయకుండా, కేవలం ఒక చిన్న హ్యాబిట్ మార్చడంతోనే బరువు కంట్రోల్‌లోకి తెచ్చుకోవచ్చని చెబుతోంది. స్టార్ హీరోయిన్ చెప్పిన ఈ సీక్రెట్ వైరల్ అవుతోంది, ఎందుకంటే అది సైన్స్ బ్యాక్డ్, ఈజీ టు ఫాలో. ఈ హ్యాక్ ఆమె స్లిమ్ ఫిగర్‌కు కీలకమైనది, మరి మీరు కూడా ట్రై చేస్తారా? చిన్న పోర్షన్‌లలో తీసుకుని, ఒక్కో బైట్‌ను జాగ్రత్తగా నములుతూ తినాలని సూచించింది.



## మూడో రౌండ్‌కు అల్కరాజ్

తన కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ వేటలో ఉన్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాజ్ ఈ టోర్నీ మూడో రౌండ్‌కు చేరాడు. బుధవారం ఇక్కడ జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్కరాజ్‌తో పాటు స్టార్ ప్లేయర్లు తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ అల్కరాజ్.. 7-6(7/4), 6-3, 6-2తో జర్మనీకి చెందిన యానిక్ హన్ఫ్‌మన్‌ను ఓడించాడు. తొలి సెట్‌లో కాస్త ప్రతిఘటించిన జర్మనీ ప్లేయర్.. తర్వాత రెండు సెట్స్‌లోనూ అదే పోరాటాన్ని కొనసాగించలేకపోయాడు. 78 నిమిషాల పాటు సాగిన తొలి సెట్‌లో 1-3తో వెనుకబడ్డ స్పెయిన్ కుర్రాడు.. సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకెళ్లి ఆధిక్యం సాధించాడు. మిగిలిన మ్యాచ్‌లలో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ).. 6-3, 4-6, 6-3, 6-4తో ముల్లర్ (ఫ్రాన్స్)ను ఓడించగా రష్యా ఆటగాడు డానియల్ మెద్వెదెవ్ 6-7(9/11), 6-3, 6-4, 6-2తో క్వింటిన్ హేల్స్ (ఫ్రాన్స్)ను చిత్తుచేశాడు.




## గ్రూప్-1పై హైకోర్టు తీర్పు వాయిదా

గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్స్‌పై( తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు కాపీ సిద్ధం కాలేదని లాయర్లకు వెల్లడించి విచారణు ఫిబ్రవరి 5కు వాయిదా వాయిదా వేసింది. కాగా, అనేక మలుపులు తిరిగిన గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్‌లో ఇప్పటికే నియామకాలు పూర్తికాగా, 562 మందికి సర్కార్ నియామక పత్రాలు సైతం అందజేసింది. గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఫలితాలు రద్దుచేసి, తిరిగి మూల్యాంకనం చేయాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు పై డివిజన్ బెంచ్ స్టే విధించి, తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉండాలని స్పష్టంచేసింది.

# టార్గెట్ చేస్తే.. ఇరాన్‌ను తుడిచి పెట్టేస్తాం



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య దశాబ్దాల కాలంగా ఉన్న వైరం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా తనను హతమార్చేందుకు ఇరాన్ కుట్ర పన్నుతోందనే వార్తలు ఎక్కువవుతున్న క్రమంలో.. ట్రంప్ ఆ దేశానికి అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. ఒకవేళ ఇరాన్ తనపై దాడికి ప్రయత్నిస్తే.. ఆ దేశాన్ని భూమి మీదే లేకుండా తుడిచి పెట్టాలని తన అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఒక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "నాకు చాలా స్పష్టమైన సూచనలు ఉన్నాయి. నాకు ఏమైనా జరిగితే.. ఇరాన్‌ను ఈ భూమి మీద నుంచి తుడిచి పెట్టేయండి అని నా సైనిక సలహాదారులకు చెప్పాను" అని తెలిపారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఒక రోగిగా అభివర్ణించిన ట్రంప్.. ఇరాన్‌కు కొత్త నాయకత్వం అవసరమని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి జనరల్ అబుల్ ఫజల్ షేకర్చి ధీటుగా స్పందించారు. "మా నాయకుడిని ఎవరైనా తాకాలని చూస్తే.. ఆ చేతిని నరకడమే కాదు వారి ప్రపంచాన్నే పూర్తిగా తగులబెడతాం" అని హెచ్చరించారు. దీంతో ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం కాస్తా యుద్ధ వాతావరణానికి దారితీస్తోంది. గత ఏడాది కాలంగా ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంపై జరుగుతున్న నిరసనలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోంది. మానవ హక్కుల సంస్థల సమాచారం ప్రకారం.. ఈ ఆందోళనల్లో ఇప్పటి వరకు 4,519 మంది పౌరులు మరణించారు. సుమారు 26,300 మందిని ఇరాన్ భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ ఆరోపిస్తుండగా.. శాంతియుత నిరసనకారులను చంపడం సరికాదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదే కొనసాగితే.. తమ దేశం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అయితే తాజా ఉద్రిక్తతల మధ్య అమెరికా తన భారీ యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను.. ఇరాన్ దిశగా మళ్లించింది. దక్షిణ చైనా సముద్రంలో ఉన్న ఈ విమాన వాహక నౌక.. మూడు డిస్ట్రాయర్లతో కలిసి హిందూ మహాసముద్రం మీదుగా మిడిల్ ఈస్ట్ వైపు దూసుకుపోతోంది. ఇది మరికొద్ది రోజుల్లోనే పర్షియన్ గల్ఫ్ ప్రాంతానికి చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అమెరికా సైనిక కదలికలు చూస్తుంటే ఇరాన్‌లో ఏ క్షణమైనా, ఏమైనా జరగవచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.






# ప్రిక్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్

ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్ విఘ్నాలను దాటి ప్రిక్వార్టర్స్ చేరుకున్నారు. ఇటీవలే ముగిసిన ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన సింధు.. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 22-20, 21-18తో ఐదో సీడ్ మనామి సుయిజు (జపాన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్.. 21-15, 21-23, 24-22తో కొకి వతనబె (జపాన్)తో జరిగిన హోరాహోరీ పోరులో విజయం సాధించాడు. లక్ష్యసేన్.. 21-13, 16-21, 21-14తో వాంగ్ జు వీ (తైవాన్)ను మట్టికరిపించాడు. కానీ సీనియర్ షట్లర్లు కిరణ్ జార్జ్ 17-21, 14-21తో ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో ఓడగా, హెచ్ఎస్ ప్రణయ్ 19-21, 11-21తో లీ జి జియా (మలేషియా) కు తలవంచాడు. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు అన్మోల్ ముందంజ వేయగా తన్వి శర్మ, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.

# ఈడీ ముందుకు విజయసాయి రెడ్డి



ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను ముమ్మరం చేసింది. మాజీ రాజ్యసభ సభ్యుడు, విజయసాయి రెడ్డి ఈరోజు (గురువారం) ఈడీ ముందు విచారణకు హాజరుకానున్నారు. ఈడీ అధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నారు. మద్యం పాలసీ రూపకల్పన, కోట్లాది రూపాయల అవినీతి, నగదును విదేశాలకు తరలించడం, అక్రమ షెల్ కంపెనీల ఏర్పాటు వంటి అంశాలపై ఈడీ ప్రశ్నలు సంధించనుంది. అలాగే ఈ కేసులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని రేపు (శుక్రవారం) ఈడీ విచారణ చేయనుంది. మద్యం పాలసీ మార్పుల్లో ఆర్థిక సంబంధాలు, స్కామ్ లో ఎంపీ పాత్రపై ఈడీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గతంలో ఈ కేసుకు సంబంధించి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఎంపీని విచారించిన అనంతరం వెంటనే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కుంభకోణం ఏపీ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈడీ విచారణలో మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. మద్యం కుంభంకోణం ఈ కేసులో రూ.3,500కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## కీలక నిర్ణయం తీసుకున్న

# అలియా భట్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ ఇప్పుడు తన కెరీర్‌లో మరో కొత్త దశను ఆస్వాదిస్తోంది. వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో టాప్‌లో కొనసాగుతున్న అలియా... తాజాగా తన పని తీరులో కీలక మార్పులు చేసుకుంటోంది. ఇప్పటివరకు ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయడమే అలవాటుగా ఉన్న ఆమె, ఇకపై ఆ పద్ధతికి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది.

ఈ ఏడాది అలియా 'ఆల్ఫా', 'లవ్ అండ్ వార్' వంటి భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తల్లిగా తన బాధ్యతలకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై అలియా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



## రేవంత్‌తో కిషన్ రెడ్డికి

# చీకటి ఒప్పందం ఉందన్న కేటీఆర్




సింగరేణి బొగ్గు గనుల టెండర్ల కుంభకోణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వైఖరిని తప్పుబడుతూ, సీఎం రేవంత్ రెడ్డితో బీజేపీకి చీకటి ఒప్పందం ఉందేమోనని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిదికి అక్రమంగా టెండర్ కట్టబెట్టేందుకే దేశంలో ఎక్కడా లేని 'సైట్ విజిట్' నిబంధనను కొత్తగా చేర్చారని కేటీఆర్ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో మైనస్ 20 శాతానికి ఖరారైన టెండర్లను రద్దు చేసి, ఇప్పుడు దాదాపు 10 శాతం ప్లస్‌కు కాంట్రాక్టులు అప్పగించడం దారుణమని విమర్శించారు. ఈ కుంభకోణంలో ప్రధాన దోషే ముందుకొచ్చి సీబీఐ విచారణ కోరాలని కేంద్రమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పట్టపగలు దోపిడీ చేసిన దొంగే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణ జరపమని కోరతాడా అని నిలదీశారు.సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఇంత భారీ అవినీతి జరుగుతున్నా ప్రేక్షకపాత్ర వహించడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఇది కిషన్ రెడ్డి అజ్ఞానమా లేక కాంగ్రెస్‌తో కుమ్మక్కా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని నష్టాల్లోకి నెట్టి, ఆ తర్వాత సంస్థను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.ఈ స్కామ్‌పై విచారణ జరపాలని సింగరేణి కార్మికులు 'జంగ్ సైరన్' మోగించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక అని కేటీఆర్ అన్నారు.

## కరాటే కళ్యాణిపై దాడి కేసులో

# యూట్యూబర్ నరేందర్ అరెస్ట్

సినీ నటి కరాటే కళ్యాణిపై దాడి ఘటనలో యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సిద్ధమౌని నరేందర్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. లక్కీ డ్రా పేరుతో మోసాలకు పాల్పడుతున్న అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే క్రమంలో ఈ దాడి జరిగింది. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. టీటీడీ పేరుతో నరేందర్ లక్కీ డ్రా నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడని కరాటే కళ్యాణి గతంలోనే పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.399కే ఫార్చ్యూనర్ కారు, ఐఫోన్ వంటి బహుమతులు ఇస్తామని నమ్మిస్తూ అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదిభట్ల సమీపంలోని వండర్లా వద్ద నరేందర్ లక్కీ డ్రా ప్రచారం చేస్తుండగా, కరాటే కళ్యాణి పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లారు. అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే సమయంలో నరేందర్, అతని అనుచరులు సుమారు 10 మంది తనపై దాడికి యత్నించారని, చున్నీ లాగి అసభ్యంగా ప్రవర్తించారని కళ్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నరేందర్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 74, 75, 79, 115(2), 132, 351(2), 352 కింద కేసు నమోదు చేశారు. విచారణలో నరేందర్‌పై గతంలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసు కూడా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. మోసాలు, దాడి ఘటనలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# మస్క్ తొలగించినా తగ్గలేదు



'ఎక్స్' (ట్విట్టర్) మాజీ సీఈఓ పరాగ్ అగర్వాల్ పేరు చెప్పగానే, ఎలాన్ మస్క్ ఆయన్ను పదవి నుంచి తొలగించిన ఘటనే గుర్తుకొస్తుంది. కానీ, సరిగ్గా రెండేళ్ల తర్వాత పరాగ్ టెక్ ప్రపంచంలోకి ఘనంగా పునరాగమనం చేశారు. ఆయన స్థాపించిన 'పారలల్ వెబ్ సిస్టమ్స్' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఇప్పుడు ఏకంగా రూ. 6,000 కోట్లకు పైగా విలువతో సంచలనం సృష్టిస్తోంది. 2022 అక్టోబరులో ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న వెంటనే పరాగ్‌ను సీఈఓ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఫేక్ అకౌంట్ల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మస్క్ ఆయన్ను అవమానకరంగా ఆఫీసు నుంచి బయటకు పంపించడంతో అప్పట్లో ఇది పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల పాటు పరాగ్ అగర్వాల్ పెద్దగా వార్తల్లో కనిపించలేదు. అయితే, ఈ విరామంలో ఆయన తన పాత మిత్రులతో కలిసి ఒక కొత్త ఏఐ స్టార్టప్‌ను ప్రారంభించారు. డెవలపర్స్ కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థను నిర్మించారు. పరాగ్ ప్రతిభపై నమ్మకంతో ఖోస్లా వెంచర్స్ వంటి ప్రముఖ సంస్థలు సుమారు రూ. 250 కోట్ల ప్రారంభ పెట్టుబడిని అందించాయి. ముంబై ఐఐటీలో చదువుకున్న పరాగ్ అగర్వాల్, 2011లో సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ట్విట్టర్‌లో చేరారు. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతూ 2021లో కంపెనీకి సీఈఓ అయ్యారు. ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా, తన నైపుణ్యంతోనే తిరిగి సమాధానం చెప్పారు. మస్క్ ఆయనను ఉద్యోగం నుంచి తొలగించగలిగినా, ఆయనలోని ప్రతిభను మాత్రం ఆపలేకపోయారని ఈ విజయం నిరూపిస్తోంది.

## ఇంటికి నల్లా కనెక్షనను

# తొలగించిన జలమండలి అధికారులు




జలమండలి సరఫరా చేసే తాగునీటిని రెండో సారి వృధా చేసిన ఇంటి నల్లా కనెక్షన్ తొలగించారు. ఈ ఇంటి యజమాని గతంలో నీటిని వృధా చేసినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారా హిల్స్ లో జరిగింది. గత సెప్టెంబర్ 3 న జలమండలి బంజారా హిల్స్ రోడ్ నం. 12 లో ఓ వ్యక్తి తాగునీటి సంపు నిండి ఓవర్ ఫ్లో అయి దాదాపు ఒక కిలో మీటర్ వరకు తాగునీరు రహదారిపై ప్రవహించింది.. దీంతో ఓ అండ్ డివిజన్ స్థానిక మేనేజర్ వెళ్లి పరిశీలించి తాగునీటిని వృధా చెయ్యకూడదని చెప్పారు. అతనికి నోటీసు అందించి, ఆ వ్యక్తికి రూ.10000 జరిమానా విధించారు. అంతే కాకుండా మరో సారి ఇలా చేస్తే కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. బుధవారం జలమండలి స్థానిక అధికారులు బంజారా హిల్స్ ప్రాంతంలో ఉన్నతాధికారుల పర్యటన సందర్బంగా తనిఖీ చేస్తూ వెళుతుండగా... రోడ్ నం. 12 లో నీరు లీకేజీ అయినట్టు గమనించి.. గతంలోనూ నిర్లక్ష్యంతో నీటిని వృధా చేసినందుకు ఈ వ్యక్తికే జరిమానా విధించారని సరిచూసుకుని ఆగ్రహం వ్యక్తం చేసి.. రెండో సారి నీటిని వృధా చేసినందుకు ఆ ఇంటి నల్లా కనెక్షనను తొలగించారు.జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని, అలాగే విలువైన త్రాగునీటిని వృధా చేయకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు.